సాక్షి కామారెడ్డి


బుధవారం ¦ 26 ¦ మార్చి ¦ 2025



ఎండుతున్న పంటలు

ఎండలు ముదురుతుండడంతో బోర్లు ఎత్తిపోతున్నాయి. దీంతో నీరందక పంటలు ఎండుముఖం పడుతున్నాయి.

- 9లో ▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్ బుధ : 6:34 | సహర్ గురు : 4:53

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.3 /19.3

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి'



కామారెడ్డి టౌన్ : బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా కోర్టు న్యాయమూర్తి టి.నాగరాణి తెలిపారు. సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్స్ భవనంలో బాల్యవివాహాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి మాట్లాడుతూ బాల్య వివాహాలతో నష్టాలు, పిల్లల అక్రమ రవాణా, పిల్లలపై వేధింపులు అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, చిన్నారుల సమస్యలపై హెల్ప్ లైన్ నంబర్ల(100, 1098, 181, 1930, 15100)కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యురాలు స్వర్ణలత, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, లైట్ ఫర్ బ్లైండ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు మేదిని దేవి, సాధన సంస్థ కోఆర్డినేటర్లు గిరిజ, మమత పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీటీసీపీవోగా గిరిధర్

కామారెడ్డి టౌన్: డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) జిల్లా ఇన్‌చార్జి అధికారిగా కామారెడ్డి మున్సిపల్ టీపీవో గిరిధర్‌కు బాధ్యతలు అప్పగించారు. డీటీసీపీవోగా విధులు నిర్వహిస్తున్న సువర్ణదేవి ఈనెల 31 వరకు సెలవుపై వెళ్లడంతో కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

బల్దియాకు ముగ్గురు టీపీబీవోలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఆఫీసర్(టీపీబీవో)లుగా ముగ్గురు నియమితులయ్యారు. టీపీబీవోగా సాయికిరణ్ మంగళవారం విధుల్లో చేరారు. జె.మల్లికార్జున్, బి.వెంకట్ రెండు రోజుల్లో విధుల్లో చేరుతారని టీపీవో గిరిధర్ తెలిపారు.

నేడు హిందీ ఔర్ రోజ్‌గార్ వర్క్‌షాప్

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం ఉదయం 11 గంటలకు 'హిందీ భాష ఔర్ రోజ్ గార్' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, హిందీ విభాగాధిపతి జి.శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గొని హిందీతో ఉపాధి అవకాశాలను తెలుసుకోవాలని సూచించారు.

ఘనంగా గోటి తలంబ్రాల దీక్ష

నిజామాబాద్ రూరల్: శ్రీరామనవమి రోజున కనులపండువగా జరిగే భద్రాచల రామయ్య కల్యాణానికి తెలంగాణ నుంచి 250 కిలోల గోటి తలంబ్రాలు అందించాలనే సంకల్పంతో శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సంస్థ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా నగరంలోని కోటగల్లిలో ఉన్న జైర్‌కోట్ హనుమాన్ మందిరంలో మంగళవారం వంద మందికి పైగా భక్తులు రామనామ స్మరణ చేస్తూ గోటితో వడ్లను ఒలిచి సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజుకు అందజేశారు. మైసమ్మ, జైర్‌కోట్, మల్లికార్జున, విజయగణపతి భజన మండళ్ల ఆధ్వర్యంలో నాలుగు గంటలపాటు భజన కొనసాగింది. రామకోటి రామరాజును భక్తులు ఘనంగా సన్మానించారు. తాము భద్రాచలం వెళ్లలేకపోయినా.. తమ చేతులతో ఒలిచిన గోటి తలంబ్రాలు వెళ్లడం ఆనందంగా ఉందని భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

విశ్రాంత ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి



బాన్సువాడ: పట్టణంలో మంగళవారం ఆర్టీసీ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షులు కౌసర్ మాట్లాడుతూ ఆర్టీసీలో పని చేసి రిటైరయిన విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. విశ్రాంత ఉద్యోగులకు వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు మహమూద్, పండరి, యేషయ్య, గంగారాం, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గొంతెండుతోంది



బస్వన్నపల్లిలో బావిలో పదుల సంఖ్యలో మోటార్లను ఏర్పాటు చేసుకున్న దృశ్యం

- భూగర్భ జలాలు అడుగంటి అవస్థలు
- అంతటా తాగునీటికి కష్టాలు
- జిల్లా కేంద్రంలో నాలుగు రోజులకోసారి 'భగీరథ' నీటి సరఫరా
- వాటర్ ట్యాంకర్లకు పెరిగిన గిరాకీ
- నేడు కలెక్టర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం



రాజంపేటలో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటి పోతుండడంతో బోరుబావులు ఎత్తిపోతున్నాయి. 'మిషన్ భగీరథ' కూడా గొంతు తడపడం లేదు. దీంతో రోజురోజుకు తాగు నీటి కష్టాలు పెరిగిపోతున్నాయి. వేసవి కాలం ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే ముందుముందు ఇంకెలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నీటి కష్టాలను ఎప్పటికప్పుడు పాలకుల దృష్టికి తీసుకువస్తున్న 'సాక్షి' మరో ప్రయత్నం మొదలుపెట్టింది. బుధవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రజలు తమ నీటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి ఆయన చర్యలు తీసుకోనున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో పక్షం రోజులుగా తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. భూగర్భజలాలు అడుగంటి పోయి బోర్లు వట్టిపోతుండడంతో ప్రజలు దాహార్తితో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా లక్షపైచిలుకు జనాభా ఉన్న కామారెడ్డి పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రత పెరిగింది. పట్టణానికి గతంలో శ్రీరాంసాగర్ నుంచి మిషన్ భగీరథ నీరు రోజు విడిచి రోజు సరఫరా అయ్యేది. ఇటీవలి కాలంలో నాలుగైదు రోజులకోసారి సరఫరా అవుతోంది. అది కూడా కొద్దిసేపే వస్తుండడంతో ఏ ఒక్క కుటుంబానికీ సరిపోవడం లేదు. పట్టణంలోని అశోక్‌నగర్, శ్రీరాంనగర్, విద్యానగర్, ఎన్జీవోస్ కాలనీ, కాకతీయనగర్ తదితర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పడిపోయి వందలాది బోర్లు ఎత్తిపోయాయి. చాలా కుటుంబాలు నీళ్ల లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నీటిని కొనుక్కోవాల్సి వస్తుండడంతో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. మొన్నటి వరకు 5 వేల లీటర్ల ట్యాంకర్‌కు రూ.5 వందలు తీసుకునేవారు. ఇప్పుడు రూ. 6 వందలకు పెంచారు. రెండు, మూడు అంతస్తులపైకి నీటిని ఎక్కించాలంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. పట్టణంలో 50కి పైగా ప్రైవేటు ట్యాంకర్లు పొద్దస్తమానం తిరుగుతూనే ఉన్నాయి. మార్చి నెలలోనే పరిస్థితి ఉండడంతో ఎండాకాలమంతా ఎలా గడుస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మిషన్ భగీరథ గతంలోలాగే రోజు విడిచి రోజు నీరు వచ్చేలా చూడాలని, లేదంటే మున్సిపాలిటీ ద్వారా ట్యాంకర్లను ఏర్పాటు చేసి నిత్యం ఇంటింటికి నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు కలెక్టర్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్

జిల్లాలో తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపేందుకు 'సాక్షి' బుధవారం ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. ప్రజలు నిర్దేశిత సమయంలో ఫోన్ చేస్తే కలెక్టర్ సమాధానమిస్తారు.



తేది : 26-03-2025 (బుధవారం)

సమయం : మధ్యాహ్నం 12.00 నుంచి 1.00 గంట వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్: **99087 12421**

ఊరూరా ఇదే గోస..

జిల్లాలోని చాలా గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రమవుతోంది. మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట, రాజంపేట, తాడ్వాయి, లింగంపేట, గాంధారి, పెద్దకొడప్‌గల్, సదాశివనగర్, కామారెడ్డి, పిట్లం, మద్నూర్, బిచ్కుంద, జుక్కల్ తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో బోర్లు ఎత్తిపోయి ప్రజలు గోసపడుతున్నారు. గిరిజన తండాల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. గతంలో పంచాయతీ పాలక వర్గాలు నీటి సమస్య పరిష్కారం కోసం ప్రయత్నాలు చేసేవి. ఏడాది కాలంగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. గ్రామ పంచాయతీలలో నిధులు లేకపోవడంతో ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి పనులు చేయించారు. అప్పుల్లో కూరుకుపోయామని, ఇంకా భరించలేమని చేతులెత్తేస్తున్నారు. దీంతో పల్లెల్లో నీటి సమస్య మరింత జటిలంగా మారుతోంది. గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక నిధులు కేటాయించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కామారెడ్డి అశోక్‌నగర్‌లో నీటిని కొనుగోలు చేసి ట్యాంక్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం

వచ్చేనెల నుంచి సన్న బియ్యం

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- రేషన్ షాప్‌లకు చేరుతున్న బియ్యం
- జిల్లాలో 2.53 లక్షల కుటుంబాలకు మేలు



కామారెడ్డి రూరల్ : పేదలకు రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణీ చేసేందుకు సర్కారు సన్నద్ధమైంది. దీనికి ఉగాది రోజున ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. వచ్చేనెలనుంచి లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. రేషన్ షాప్‌ల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం గతంలోనే నిర్ణయించినా.. సరిపడా బియ్యం లేక వాయిదా వేసింది. ప్రస్తుతం నిల్వలు ఉండడంతో ఉగాది పండుగ సందర్భంగా పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది.

జిల్లాలో 577 రేషన్ దుకాణాల పరిధిలో 2,53,674 రేషన్ కార్డులున్నాయి. ఒక్కో యూనిట్‌కు 6 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. ప్రతినెలా 5,458 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అందిస్తున్నారు. వచ్చేనెలనుంచి లబ్ధిదారులందరికీ సన్నబియ్యం అందనున్నాయి. జిల్లాలో ఉన్న 7 ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ఆయా రేషన్ షాపులకు సన్నబియ్యం పంపిస్తున్నారు. గతంలో రేషన్ షాపుల్లో దొడ్డు బియ్యం మిగిలి ఉంటే తిరిగి గోదాంలకు తీసుకువెళ్తున్నారు.

వడ్లకు బోనస్ ఇస్తూ..

రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్నబియ్యం సరఫరా చేయాలని గతంలోనే నిర్ణయించిన సర్కారు.. సన్న రకాల సాగును ప్రోత్సహించేందుకు క్వింటాలుకు కనీస మద్దతు ధరపై రూ. 500 బోనస్ ఇస్తోంది. గత సీజన్‌నుంచి దీనిని అమలు చేస్తున్నారు. దీంతో రైతులు సైతం యాసంగిలో సన్న రకాల సాగుకు మొగ్గు చూపారు.

రీసైక్లింగ్ నిరోధానికి..

పేదలకు రేషన్ షాప్‌ల ద్వారా ఉచితంగా సరఫరా చేస్తున్న దొడ్డు బియ్యాన్ని చాలామంది భోజనానికి ఉపయోగించడం లేదు. దళారులు కిలోకు రూ.10 నుంచి రూ. 20 వరకు చెల్లిస్తూ రీసైక్లింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పేదలు తినగలిగే నాణ్యమైన బియ్యాన్ని ఇస్తే ఈ రీసైక్లింగ్ దందాకు అడ్డుకట్ట వేయవచ్చని సర్కారు భావిస్తోంది.

బాన్సువాడ తైబజార్ వేలం

బాన్సువాడ : బాన్సువాడ మున్సిపాలిటీ తైబజార్‌కు మంగళవారం వేలం పాట నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు ఆధ్వర్యంలో ప్రక్రియ సాగింది. కాంట్రాక్టర్ జంషేర్ ఖాన్ రూ. 46.26 లక్షలకు మేకలు, గొర్రెలు సంతను దక్కించుకున్నారు. గతేడాది ఈ సంత తైబజార్ రూ.43.93 లక్షలు పలికింది.

- రోజువారి సంతను లింగాల ప్రీతంరెడ్డి రూ.9.02 లక్షలకు దక్కించుకున్నారు. ఈ సంతకు గతేడాది కూడా ఇదే ధర లభించింది. పశువుల దాఖలను ప్రీతంరెడ్డి రూ. 20 వేలకు దక్కించుకున్నారు. ఈ సంత గతేడాది రూ. 10 వేలే పలకడం గమనార్హం.
- వారసంతను జగన్మోహన్‌రావు రూ. 12.31 లక్షలకు దక్కించుకున్నారు. గతేడాది ఈ సంత రూ. 12.33 లక్షలు పలికింది. తైబజార్‌తోపాటు సంతలను వేలం వేయగా బల్దియాకు గతేడాది కంటే రూ. 2.40 లక్షల ఆదాయం అదనంగా సమకూరిందని బాన్సువాడ మున్సిపాలిటీ మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు.



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఎల్‌ఆర్‌ఎస్‌ను వేగవంతం చేయాలి



మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ కార్యక్రమాలను పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 25 శాతం రాయితీతో లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఇచ్చిన గడువు ఈనెల 31 తో ముగియనుందన్నారు. దరఖాస్తుదారులు త్వరగా ఫీజు చెల్లించి రాయితీ పొందాలని సూచించారు. దరఖాస్తుదారులు రుసుము చెల్లించిన 48 గంటల్లోనే ప్రొసిడింగ్స్ జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ వేణుగోపాల్, టీపీవో గిరిధర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా అధికారులు

కామారెడ్డి క్రైం : జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాసంగిలో 6.20 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి రావచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. రైతుల ఇంటి అవసరాలు పోను కొనుగోలు కేంద్రాలకు 5.63 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రావచ్చని భావిస్తున్నామన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. వరి కోతలు ప్రారంభమై ధాన్యం వచ్చిన ప్రాంతాలలో వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రాలలో తగినన్ని టార్పాలిన్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి కేంద్రంలో రైతులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, టెంట్లు వేయాలని సూచించారు. తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్, గన్నీ బ్యాగులను సిద్ధం చేయాలన్నారు. వడ్లకు కనీస మద్దతు ధర గ్రేడ్ ఏ రకానికి రూ. 2,320, సాధారణ రకానికి రూ. 2,300 చెల్లిస్తామని, సన్న రకం వడ్లకు రూ.500 బోనస్ రూపంలో ఇస్తామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలను పరిష్కరించడానికి జిల్లా కార్యాలయంలో టోల్‌ఫ్రీ నంబర్ 08468-220051 ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, సివిల్ సప్లయ్ డీఎం రాజేందర్, డీఎస్‌వో మల్లిఖార్జున బాబు, డీఏవో తిరుమల ప్రసాద్, మార్కెటింగ్ అధికారి రమ్య, డీటీవో శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

మొక్కలను జాగ్రత్తగా పెంచాలి

- తాగు నీటి ఎద్దడి రాకుండా చూడాలి
- డీపీవో మురళి



నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో మురళి

గాంధారి(ఎల్లారెడ్డి) : వేసవిలో నర్సరీల్లోని మొక్కలను జాగ్రత్తగా పెంచాలని డీపీవో, మండల ప్రత్యేకాధికారి మురళి సూచించారు. హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలను కాపాడాలన్నారు. మంగళవారం ఆయన మండలంలోని నాగ్లూర్, నేరల్, నేరల్ తండా, చద్మల్, చద్మల్ తండా, బీర్మల్ తండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నర్సరీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కంపోస్ట్‌షెడ్లులను పరిశీలించారు. తాగు నీటి ఎద్దడి రాకుండా చూడాలని, శానిటేషన్ బాగా చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ జీపీ కార్యదర్శులకు సూచనలు ఇవ్వాలని ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో లక్ష్మీనారాయణలకు సూచించారు. ఆయన వెంట కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.



లెండి వాగులోంచి ప్రయాణిస్తున్న ప్రజలు

వంతెన నిర్మించరూ..

మద్నూర్ : మద్నూర్ మండలం మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉంటుంది. సరిహద్దుల్లోని గ్రామాల ప్రజల మధ్య బంధుత్వాలూ ఉంటాయి. ఇక్కడివారికి అక్కడ, అక్కడికివారికి ఇక్కడ వ్యవసాయ భూములు కూడా ఉన్నాయి. మండలంలోని తడిహిప్పర్గా గ్రామ శివారులోని లెండి వాగు అవతలి వైపు మహారాష్ట్ర భూభాగం ఉంది. ఇక్కడ వంతెన లేకపోవడంతో వాగులోంచే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వాగులో ప్రస్తుతం నడుములోతు వరకు నీళ్లున్నాయి. ఇటు వారు అటువైపు వెళ్లాలంటే సుమారు 20 కిలోమీటర్లు తిరగాల్సి వస్తుంది. దీంతో ప్రమాదకరమని తెలిసినా ప్రజలు వాగులోంచే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



తడిహిప్పర్గా వద్ద లెండివాగులోంచి వెళ్తున్న ట్రాక్టర్

అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలి



రుణమాఫీపై చర్చిస్తున్న రైతులు

నాగిరెడ్డిపేట: అర్హులైనవారి పంట రుణాలను మాఫీ చేయాలని తాండూర్ సహకార సంఘం మహాజన సభలో రైతులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మండలంలోని తాండూర్ సహకార సంఘం చైర్మన్ గంగారెడ్డి అధ్యక్షతన మహాజనసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘం ద్వారా జరిగిన ఆర్థిక లావాదేవీలను సీఈవో చంద్రమురళి చదివి వినిపిస్తుండగా రైతులు అడ్డుకొని తమకెందుకు రుణమాఫీ కాలేదని ప్రశ్నించారు. సహకార సంఘం పరిధిలో అర్హులైన ప్రతిఒక్కరికీ రుణమాఫీ చేయాలన్నారు. ఇప్పటివరకు సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగిన తాండూర్, జలాల్‌పూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల సమాఖ్యకు అప్పగించడాన్ని సభ్యులు వ్యతిరేకించారు. దీనిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ బాబురావు, మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, నాయకులు సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజంపేట పీహెచ్‌సీలో 'ఆరోగ్య మహిళ'



రాజంపేట: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ విజయమహాలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 65 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంగీత, సూపర్‌వైజర్ మంజూర్,ల్యాబ్ టెక్నీషీయన్ సంతోష్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



బీబీపేట: మండలంలోని యాడారం, శివారు రాంరెడ్డిపల్లి గ్రామాల్లో మన ఊరు – మేము సైతం ఫౌండేషన్ సభ్యులు చలివేంద్రాలు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



తెయూ(డిచ్‌పల్లి): తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో ఈనెల 23 జరిగిన ఇంటర్నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాంగ్రెస్–2025 కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ వృక్షశాస్త్ర విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఎం.అరుణకు బోధన, పరిశోధన విభాగంలో ఇంటర్నేషనల్ అవుట్ స్టాండింగ్ రీసెర్చ్ అవార్డు లభించింది. ఈసందర్భంగా అవార్డు గ్రహీత అరుణను మంగళవారం తెయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి అభినందించి, సన్మానించారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి హలీంఖాన్, ప్రొఫెసర్ విద్యావర్ధిని, అధ్యాపకులు శ్రీనివాస్, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

తుస్సుమన్న ఆశలు

- శాతవాహన యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల
- తెలంగాణ యూనివర్సిటీపై ఎందుకీ వివక్ష అంటున్న విద్యావేత్తలు
- సీఎం రేవంత్ హామీ ఇచ్చినా జిల్లాకు మొండిచేయి
- ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల వైఫలమని విద్యార్థి సంఘాల ఆగ్రహం



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరవుతుందని అంతా భావించినప్పటికీ ఆశలు తుస్సుమన్నాయి. శాతవాహన యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తెయూపై మరోసారి వివక్ష ప్రదర్శించిందని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల నాయకులు, జిల్లావాసులు మండిపడుతున్నారు. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినా ఇంజినీరింగ్ కళాశాల మంజూరు విషయంలో జిల్లాను విస్మరించారంటున్నారు. ఇంజినీరింగ్ కళాశాల కోసం ఉద్యమాలు చేసినా మొండి చేయి చూపారని, అడగకుండానే కరీంనగర్ జిల్లాకు ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేశారని వాపోతున్నారు. ఇది పూర్తిగా జిల్లాకు చెందిన రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల వైఫల్యమని విమర్శిస్తున్నారు.

తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటై 18 ఏళ్లు గడుస్తున్నా, వర్సిటీకి 577 ఎకరాల సువిశాల ప్రాంగణం ఉన్నా, ఇక్కడి నుంచి పంపిన ప్రతిపాదనలను పట్టించుకున్న వారు లేరు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు అంశాన్ని గుర్తుచేయగా సానుకూలంగా స్పందించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. జిల్లా నుంచి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంతో తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందని, ఇప్పటికైనా మించి పోయింది లేదని, కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోగా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిపై ఒత్తిడి తెచ్చి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయించుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

అన్ని ప్రయత్నాలు చేశాం



గత రెండు సంవత్సరాలుగా ఇంజినీరింగ్ కళాశాల మంజూరు ప్రతిపాదనలు ఉన్నత విద్యాశాఖకు పంపిస్తున్నాం. ఇటీవల ఉన్నతస్థాయిలో ఈ విషయాన్ని గుర్తు చేస్తూ వచ్చాం. ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, సుదర్శనరెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం జరగాల్సి ఉంది. వర్సిటీలో వసతులకు కొరత లేదు. అనుమతులొస్తే కోర్సులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– టి యాదగిరి రావు, వీసీ, తెయూ

ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే..



తెలంగాణ యూనివర్సిటీతో పోలిస్తే అన్ని విధాలుగా వెనుకబడి ఉన్న యూనివర్సిటీలకు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కానీ, తెయూ పరిధిలో కానీ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల లేకపోవడం జిల్లా ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంగా చెప్పొచ్చు. పేద విద్యార్థులను ఇంజినీరింగ్ విద్యకు దూరం చేసే కుట్ర చేస్తున్నారు.

– బి.శివ, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు

మొక్కలకు నీళ్లు పట్టాలి



జనగామ గ్రామంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్

నిజాంసాగర్/బీబీపేట/లింగంపేట : మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్ గ్రామ వన నర్సరీని మండల ప్రత్యేక అధికారిణి అరుణ పరిశీలించారు. వన నర్సరీలో పెంచుతున్న మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని ఈజీఎస్ సిబ్బందికి ఆమె సూచించారు. పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ సింగ్, ఫీల్డ్‌అసిస్టెంట్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు. బీబీపేట మండలం జనగామ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ పరిశీలించారు.ఎండలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు సూచించారు. అనంతరం బీబీపేటలో నర్సరీని పరిశీలించి మొక్కలకు క్రమం తప్పకుండా నీళ్లు పట్టాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్, తదితరులున్నారు. లింగంపేట మండలం బోనాల్, బాయంపల్లి, కోర్పోల్, బాణాపూర్, నాగారం గ్రామాల శివారులో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఉపాధి పనులు కొలతల ప్రకారం చేయాలని సూచించారు. అనంతరం నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. నర్సరీలలోని మొక్కలకు ప్రతీ రోజు నీరు పట్టాలని సూచించారు. అలాగే సీసీ రోడ్లు, క్యాటిల్ షెడ్‌లను పరిశీలించారు. ఆయన వెంట క్షేత్రసహాయకుడు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

దేశాయిపేట్ సొసైటీ వైస్‌చైర్మన్ మృతి

బాన్సువాడ రూరల్: మండలంలోని దేశాయిపేట్ వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం ఉపాధ్యక్షులు అంబర్‌సింగ్ (60) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు.రాంపూర్ తండాలో వడ్లు ఆరబెడుతుండగా గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు నిజామాబాద్ తరలిస్తుండగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు వారు ఫోన్‌చేసి ఓదార్చారు.

పశువుల పాకనా... ఇరిగేషన్ కార్యాలయమా..?



అచ్చంపేట గెస్ట్‌హౌస్ ప్రధాన ద్వారం వద్ద పశువులు



నిజాంసాగర్ నీటిపారుదలశాఖ డివిజన్ కార్యాలయం గేటు వద్ద..

నిజాంసాగర్(జుక్కల్): మండంలోని అచ్చంపేట గెస్ట్ హౌస్, నిజాంసాగర్ నీటిపారుదల శాఖ డివిజన్ కార్యాలయ ప్రాంగణం పశువుల పాకను తలపిస్తోంది. గెస్ట్ హౌస్, ఇరిగేషన్ కార్యాలయాలు పక్క, పక్కనే ఉన్నాయి. సదరు కార్యాలయాల ఆవరణలో ఉన్న చెట్ల కింద పశువులను కట్టేస్తూ పెంటకుప్పలు వేస్తున్నారు. ఇరిగేషన్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన గేటుతో పాటు గెస్ట్ హౌస్‌కు వెళ్లే ప్రధాన గేటు, అచ్చంపేటకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో అధికారుల ఉదాసీనతను చూసి అటువైపు వెళ్లే వారు ఆశ్చర్యపోతున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

భగవంతుడికి కృతజ్ఞతాపూర్వకంగా ఉండాలి

- గంగోత్రి రామానుజ దాసుస్వామి
- వైభవంగా కొనసాగుతున్న 'ఇందూరు తిరుమల' బ్రహ్మోత్సవాలు




స్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న వేద పండితులు, బ్రహ్మోత్సవాలకు హాజరైన సినీ ప్రముఖులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మనుషులు సదా భగవంతుడికి కృతజ్ఞతాపూర్వకంగా ఉండాలని ఆచార్య గంగోత్రి రామానుజ దాసుస్వామి అన్నారు. లోక కార్యానికి భగవంతుడు మనుషులను ఎంచుకుంటాడని, మనల్ని ఎంచుకునేలా అర్హత సాధించాలని తెలిపారు. మండలంలోని నర్సింగ్‌పల్లి 'ఇందూరు తిరుమల' ఆలయ 11వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు మంగళవారం యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ పుష్కరిణిలో స్వామివారికి చక్రస్నానం, సాయంత్రం పుష్ప యాగం కార్యక్రమం చేపట్టారు. అనంతరం దేవనాథ జీయర్ స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజ దాసుస్వామి భక్తులనుద్దేశించి ప్రవచనాలు చేశారు. కలియుగంలో హరినామమే మోక్ష మార్గమని, ప్రతి క్షణం హరి నామం జపిస్తూ ఉండాలని సూచించారు. ఇందూరు తిరుమల దేవస్థానం ఇలలో మరో వైకుంఠంగా వెలుగొందుతుందన్నారు. వేడుకల్లో సినీ దర్శకుడు అనిల్ రావిపూడి, ఛాయాగ్రాహకుడు సమీర్‌రెడ్డి, హీరోలు నారాయణమూర్తి, ఆశిష్, ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి, దిల్‌రాజు, శిరీష్‌రెడ్డి, విజయసింహారెడ్డి, హరీష్, సుదర్శన్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



కామారెడ్డి టౌన్ : రంగారెడ్డి జిల్లాకు చెందిన న్యాయవాది ఇజ్రాయెల్ హత్య ఘటనను నిరసిస్తూ కామారెడ్డి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించారు. జిల్లా కోర్టు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అసెంబ్లీలో ప్రవేశపెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్ కార్డులు పంపారు. కార్యక్రమంలో న్యాయవాదులు జగన్నాథం, భిక్షపతి, నంద రమేష్, నర్సింహారెడ్డి, సిద్ధిరాములు, అమృత్‌రావు పాల్గొన్నారు.

కరెంటు షాక్‌తో రైతు మృతిపై కేసు నమోదు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని రాంపూర్‌గడ్డ తండాలో సోమవారం కరెంటు షాక్‌తో పిట్ల శ్రీను (32) అనే రైతు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మృతుడి భార్య పూజ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయలు తెలిపారు.

ఎల్లారెడ్డిలో మహిళ అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలో ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై మహేష్ మంగళవారం తెలిపారు. ఎల్లారెడ్డిలోని కల్యాణిబేస్ కాలనీలో నివాసముండే ఎండ్లూరి రాజేశ్వరి (28) అనే మహిళ ఈనెల 19న ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. ఇప్పటివరకు తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో రాజేశ్వరి భర్త పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాల్వంచ మండలంలో...

మాచారెడ్డి: భర్త మందలించాడని ఏడేళ్ల కూతురుతో పాటు తల్లి అదృశ్యమైన ఘటన పాల్వంచ మండలం పోతారంలో జరిగింది. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన గ్యార వసంత భర్త మందలించాడని సోమవారం తన చిన్న కూతురు హిరణ్య తీసుకొని ఇంటి నుంచి వెళ్ళిపోయింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా వారి ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని శివాపూర్ గ్రామ శివారులో సైకిల్‌ను బైక్ ఢీకొనడంతో ఒకరికి గాయాలైనట్లు స్థానికులు మంగళవారం తెలిపారు. ఎల్లారెడ్డికి చెందిన గంగారాం శివాపూర్ నుంచి ఎల్లారెడ్డి వైపునకు వస్తుండగా, ఎల్లారెడ్డి వైపు నుంచి శివాపూర్ వైపునకు వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో సైకిల్‌పై ఉన్న గంగారాంకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆటో–కారు ఢీకొనడంతో..

ఎల్లారెడ్డి: మండలంలోని కళ్యాణి గ్రామ శివారులో ఆటో–కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. నిజాంసాగర్ నుంచి ఎల్లారెడ్డి వైపునకు వస్తున్న కారు కల్యాణి ప్రాజెక్టు వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నిజాంసాగర్‌కు చెందిన సునీత, అనిత అనే ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని సమీప ఆస్పత్రికి తరలించగా, సునీతకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌కు రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

క్రైం కార్నర్

కాలువలో పడి ఒకరి మృతి.. మరొకరు గల్లంతు



బాల్కొండ: మండలంలోని కాకతీయ కాలువలో పడి ఒకరు మృతిచెందగా, మృతుడి ఆచూకీ కోసం వచ్చిన మరో వ్యక్తి అదే కాలువలో పడి గల్లంతయ్యాడు. మెండోరా ఎస్సై నారాయణ తెలిపిన వివరాలు ఇలా.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ తాలుకకు చెందిన దేశ్‌ముఖ్ మారుతి(32) కూలీ పనుల కోసం ఇటీవల మెండోరాకు వచ్చాడు. రెండు రోజుల క్రితం మారుతి కాలకృత్యాలు తీర్చుకోవడానికి కాలువ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతయ్యాడు. కాలువ వద్ద అతడి చెప్పులు ఆధారంగా మంగళవారం గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వెతకడానికి వెళ్లి..



మారుతి గల్లంతయ్యాడని తెలియడంతో వెతుకుట కోసం అదే గ్రామానికి చెందిన హరి లఖోడి రాజారాం, అవినాష్ బైక్‌పై సోమవారం బయలుదేరారు. వెల్కటూర్ గ్రామ శివారులోని కాకతీయ కాలువ వద్ద వీరి బైక్ అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. వెనుక కూర్చున్న అవినాష్ పక్కకు దూకగా, బైక్‌పై ఉన్న రాజారాం బైక్‌తో సహ కాలువలో గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణ పేర్కొన్నారు. గాలింపు చేపట్టినట్లు తెలిపారు.

అనారోగ్యంతో గన్నారం జీపీ కార్యదర్శి మృతి



ఇందల్వాయి: గన్నారం గ్రామ పంచాయతీ కార్యదర్శి(గ్రేడ్1) వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందారు. ఇందల్వాయి మండల కేంద్రంలో ఉంటూ గన్నారంలో విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు సోమవారం అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తోటి ఉద్యోగులు తెలిపారు. మృతుడి స్వస్థలం జోగులాంబ గద్వాల్ జిల్లా మానవపాడు మండలం అని తెలిసింది. మృతుడికి ఇద్దరు కొడుకులు ఉన్నట్లు సమాచారం.

గుండెపోటుతో వివాహిత..

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఓ వివాహితకు ఆపరేషన్ చేస్తుండగా గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. వివరాలు ఇలా.. మోర్తాడ్ మండలం ఏర్గట్ల గ్రామానికి చెందిన మార్వాడి మాన్విత(23)కు ఐదేళ్ల క్రితం నందిపేట్ మండలం షాపూర్ గ్రామానికి చెందిన సురేష్‌తో వివాహం జరిగింది. పిల్లలు పుట్టటం లేదని మాన్వితకు మంగళవారం పెర్కిట్‌లోని ఓ ఆస్పత్రిలో ఆపరేషన్ చేస్తుండగా గుండెపోటు రావడంతో మృతిచెందింది. భర్త సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

ఎల్లారెడ్డి: మెదక్ జిల్లా మాసాయిపేటలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎల్లారెడ్డి మండలం కొట్టాల్ గ్రామానికి చెందిన బోదాటి సాయవ్వ (43) అనే మహిళ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సాయవ్వ దంపతులు కొన్ని నెలల క్రితం ఉపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. ఈక్రమంలో మాసాయిపేటలో కూలి పనులు చేసేందుకు రైలు దిగి రోడ్డు దాటుతున్న సమయంలో సాయవ్వను ఓ ప్రయివేటు బస్సు ఢీకొట్టింది. ఈఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. సాయవ్వ అంత్యక్రియలు ఆమె స్వగ్రామమైన కొట్టాల్‌లో నిర్వహించినట్లు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ధర్పల్లి: మండలంలోని హొన్నాజీపేట్ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ధ్యాప పెద్ద నర్సయ్య (60)కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇటీవల ఆయన కొత్తగా ఇంటిని నిర్మించుకున్నారు. ఇంటి నిర్మాణానికి అప్పులు కావడంతోపాటు తన మూడో కుమార్తెకు ఆరోగ్యం బాగాలేక వివాహం కావడంలేదు. దీంతో పెద్ద నర్సయ్య మనస్థాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కొమరవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ పేర్కొన్నారు.

ఇష్టం లేని పెళ్లి చేయడంతో యువతి



వల్లెపు లక్ష్మి (ఫైల్)

బాన్సువాడ రూరల్: మండలంలోని కొల్లూర్ గ్రామంలో ఇష్టం లేని పెళ్లి చేయడంతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. బాన్సువాడ సీఐ మండలి అశోక్ తెలిపిన వివరాలు ఇలా.. కొల్లూర్ గ్రామానికి చెందిన వల్లెపు లక్ష్మికి ఫిబ్రవరి 23న అదే గ్రామంలో ఉంటున్న దగ్గరి బంధువైన వెంకటేష్ అనే యువకుడితో వివాహం జరిగింది. కాగా లక్ష్మికి వివాహం ఇష్టంలేక మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తల్లి చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అత్తింటి వేధింపులు భరించలేక వివాహిత..



సులోచన (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్ గ్రామంలో ఓ వివాహిత అత్తింటి వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్సై ప్రకాష్‌నాయక్ తెలిపిన వివరాలు ఇలా.. అయిలాపూర్ గ్రామానికి చెందిన గుడ్డోళ్ల సులోచన(32)కు 2018లో కోర్పోల్ గ్రామానికి చెందిన కుమార్‌తో వివాహం జరిగింది. వీరికి అభినయ్, దీక్షిత ఇద్దరు పిల్లలు. వీరు బతుకుదెరువు కోసం కొన్ని నెలల క్రితం హైదరాబాదుకు వెళ్లగా ఇటీవల కోర్పోల్ గ్రామానికి వచ్చారు. ఈక్రమంలో అత్త గంగవ్వ, ఆడపడుచు సాయవ్వ, భర్త కుమార్, బావ రవి, తోటి కోడలు లలిత కలిసి సులోచనను మానసికంగా వేధింపులకు గురిచేసేవారు. ఈ విషయం తన తల్లిదండ్రులకు చెప్పగా పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి సర్దిచెప్పి పంపించారు. అయినప్పటికీ వేధింపులు కొనసాగుతుండటంతో అయిలాపూర్‌లోని తల్లిగారింటికి వచ్చేసింది. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక పాయింట్‌పై టాస్క్‌ఫోర్స్ దాడి

- 9టిప్పర్లు, 3 పొక్లెయిన్లు స్వాధీనం
- 12మంది అరెస్టు



పట్టుబడ్డ డ్రైవర్లతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

ఖలీల్‌వాడి/బోధన్‌రూరల్: బోధన్ రూరల్ మండలంలోని మందర్నా ఇసుక పాయింట్‌పై టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, ఎస్సై గోవింద్, స్పెషల్‌పార్టీ సిబ్బంది దాడి చేశారు. సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి అడిషనల్ డీసీపీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారు సోమవారం అర్ధరాత్రి ఇసుకను తరలిస్తున్న తొమ్మిది టిప్పర్లతోపాటు మూడు పొక్లెయిన్లను స్వాధీనం చేసుకున్నారు. 12మంది డ్రైవర్లను అదుపులోకి తీసుకుని తదుపరి చర్య నిమిత్తం బోధన్ రూరల్ ఎస్సైకి అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య తెలిపారు.

నిబంధనలు పాటించని వ్యాపారులు

మందర్నా ఇసుక పాయింట్ నుంచి ప్రభుత్వ పనుల కోసం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కూలీల ద్వారా ట్రాక్టర్లలలో ఇసుకను తరలించడానికి అవకాశం ఉంటుంది. కానీ టిప్పర్లలలో నిబంధనల కంటే అదనంగా 10 టన్నుల వరకు ఇసుకను తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి బోధన్ పరిసర ప్రాంతాల వరకు మాత్రమే ఇసుకను తరలించాల్సి ఉంటుంది. కానీ నిజామాబాద్ వరకు తరలిస్తున్నారు. అధికారులు ఇసుక తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని బోధన్ ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన గల్ఫ్ మృతుడి అంత్యక్రియలు



అబుదబి ఎయిర్‌పోర్టు నుంచి గంగాధర్ మృతదేహాన్ని తరలిస్తున్న సన్నిహితులు

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తొర్తి గ్రామానికి చెందిన ఈర్గల గంగాధర్(44) ఇటీవల యూఏఈలోని అబుదబిలో ప్రమాదవశాత్తు మృతిచెందగా, మంగళవారం మృతదేహం స్వగ్రామానికి రాగా, అంత్యక్రియలు పూర్తయ్యాయి. గల్ఫ్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న గంగాధర్ శనివారం బైక్‌పై వెళుతున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కంపెనీ యాజమాన్యం, గంగాధర్ సన్నిహితులు మృతదేహంను ఇంటికి తరలించడానికి వేగంగా స్పందించడంతో మూడురోజుల్లోనే మృతదేహం స్వగ్రామానికి చేరింది. గ్రామస్తులు, బంధుమిత్రులు అధిక సంఖ్యలో హాజరై అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యార్థుల ఆహారం పక్కదారి!

- వంటకాలు, డ్రైఫ్రూట్స్‌ను ఇంటికి తీసుకెళ్తున్న అధికారి

నిజామాబాద్ అర్బన్: అర్సపల్లి మైనారిటీ పాఠశాలలో ఓ ప్రధాన అధికారి పాఠశాల నుంచి ప్రత్యేక వంటకాలు చేయించుకోవడంతోపాటు డ్రైఫ్రూట్స్‌ను ఇంటికి తీసుకెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై కొందరు ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. పిల్లలకు పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక మెనూను రూపొందించింది. కానీ పాఠశాలలో విద్యార్థులకు చాలీచాలని భోజనం, రుచి లేని వంటకాలు అందించగా సదరు అధికారి మాత్రం ప్రత్యేకమైన వంటకాలు చేయించుకుంటుందని సమాచారం. నిత్యం పిల్లలకు అందించాల్సిన డ్రైఫ్రూట్స్‌ను ఆ అధికారి మాత్రమే తీసుకెళుతుంది. అలాగే బియ్యం రవాణా కోసం ఆటోను వినియోగించుకున్నట్లు అదనంగా బిల్లులు జోడించి అవినీతికి పాల్పడుతున్నట్లు తెలిసింది. ఇటీవల తొలగించిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగినిని బిల్లుల సర్దుబాటు కోసం మళ్లీ అనాధికారికంగా ఉపయోగించుకుంటున్నారని పలువురు ఆరోపించారు. దీంతో ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. త్వరలోనే చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

చర్యలు తీసుకుంటాం..

పిల్లలకు అందించాల్సిన నాణ్యమైన భోజనంను ప్రత్యేకంగా ఎవరు తీసుకువెళ్లకూడదు. డ్రైఫ్రూట్స్‌ను పిల్లలకు మాత్రమే అందించాలి. పిల్లలకు ఇవ్వకుండా ఇంటికి తీసుకెళ్తే చర్యలు తప్పవు. ఘటనపై విచారణ చేపడుతాం.

– కృష్ణవేణి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి